# పరిష్కారం

'చూడూ... మన పెళ్ళై ఎన్నాళ్లయిందీ' తీరుబడిగ న్యూస్ పేపర్ తిరగేస్తూ అడిగేను.

కాఫీ కప్పు అందిస్తూ' రోజులు కాదు... ఏళ్లు!... రెండేళ్లయింది'. రిప్లై ఇచ్చింది హైమ.

అబ్బా! రెండేళ్లా?... అవునూ ఈ ఇరవైనాలుగు నెలలూ అనగా ఏడువందల ముప్పై రోజులూ మనం కాపురం చేస్తూనే వున్నామా? అంటే శోభనం రాత్రి నుండి నేటివరకు నీ జోలికి రాలేదు. నిన్ను తాకనిి లేదు. శారీరకంగ నువ్వూ నేను సపరేట్‌గానే వుంటున్నాం! అవునా?-' అడిగాను.

తలాడించి నేలచూపులు చూస్తోంది హైమ... '

వెయ్యి ఆమడల దూరం ! అవునా?-' పెళ్లాన్ని గుచ్చిగుచ్చి చూస్తూ కసిగా మాట్లాడాను.'

నోరు మెదపలేదు.

'ఇలా నిన్ను నేను ప్రశ్నించటం పదిలక్షల యాభైవెయ్యోసారి ! కాదంటావా?...'

హైమ నోరిప్లై

నామటుకు నేను వాగుతూనే వున్నాను.

'అసలు మనం పెళ్లెందుకు చేసుకున్నట్టు?-' స్వరం పెంచాను.

'ఏమో... నాకేంతెలుసు?'

'నే చెప్పినా నీకు విన్పించదు. చెవుల్లో సీసం కరిగించి పోసుకున్నావ్. చెప్పిచెప్పీ విసుగన్పిస్తోంది. మనం సంసారం చేస్తూ పిల్లలను కనాలని పెద్దవాళ్లు మనకు పెళ్లి చేశారు... పోనీ ఈ విషయమైనా తెలుసా?-'

'నాకు అన్నీ తెలుసు.'

'తెలిసీ మాట్లాడవ్! నా దగ్గరకు రావు! నన్ను సుఖపెట్టి నువ్ సఖపడవ్.. ఏం? ఎందుకని?- నీకేమైనా అనారోగ్యమా?-'

'అలాంటిదేం లేదు...' తిరిగిచ్చిన కాళీ కప్పు అందుకుని చెప్పింది.

'పోనీ... పెళ్లికి ముందే.... నువ్వెవరినైనా 'లవ్' చేశావా?-'

'లేదు...'

'మీ వాళ్ల బలవంతంమీద పెళ్లికి అంగీకరించావా?- నీ గురించి ఎలాంటి నిర్ణయానికిరావాలో అర్థమై చావటం లేదు....రెండేళ్లగ..'

'బువ్వకే తికానలేని నా మాఖానికి 'లవ్' కూడానా? పెళ్లిలో మీకివ్వాల్సిన పదివేల కట్నానికీ పాతికమంది ముందు నిలబడి చెయ్యి చాచాడు మాడాడీ!. ఎన్నో ఇబ్బందులుపడి మొత్తానికి పెళ్లి చేశానన్పించుకున్నాడు. మీకు నన్ను కట్టబెట్టి కన్నెచెర వదిలించుకున్నారు...' చిర్రున చీది పైటకొంగుతో ముక్కు తుడుచుకుంది.

'అద్సరేలే!... ఎన్నాళ్లపోయినా... మనిద్దరమేనా?... సంఖ్య మూడు అయ్యేరాత లేదా?... మావారంతా ఎగతాలి చేస్తున్నారు...'

'ఎందుకు?-'

'మగాడిని కానేమోనని...'

'ఛపోండి...' సిగ్గు అభినయించింది.

'అలా సిగ్గుపడకు!... సిగ్గు ఎగ్గూలేని బతుకైంది నాది!'

'కొందరి జీవితాలంతేనండీ!. దైవ సంకల్పం లేకపోతే బిడ్డలకు తల్లితండ్రులం కాలేము...'

'ఎంత ఫిలాసఫీ చెప్తున్నావే!. మనం ఒకరినొకరం అనుక్షణం అసంతృప్తితో తిట్టుకోవటమే సరిపోతోంది! ఒక సుఖమా?... సంతోషమా?... ఆనందమా?... తృప్తా... అంతా మనలావున్నారా?-' పెళ్లై పదినెలలు తిరక్కుండానే చంకనెత్తుకున్న వారెందరో వున్నారు. మన ఖర్మేమో ఇలా కాలింది...'

'మీకెప్పుడూ ఇదేయావ... ఆలోచన!. దానిపై ధ్యాస తప్పించి మరోటి లేదు మీకు...'

'అపు నీ నంగనాచి మాటలు!. యుక్తవయసులో వున్న జంట ఎంత హేపీగ వుండాలి?!- మీ అమ్మ నాన్నలు మనలా వుండి వుంటే... నువ్వేకాదు... నీకిద్దరు చెల్లెళ్లు ... ఇద్దరు తమ్ముళ్లు ఎక్కడ్నించి వచ్చేవారు?- మాట్లాడు!... అట్లా గుడ్లప్పగించి చూస్తావేం?-'

'ఇదేకదా మీ రొటీన్ టాపిక్?- భార్యని షోకేస్‌లో గాజుబొమ్మలా చూచుకోవాలి... బానిసగాకాదు...'

'ఆమాత్రం నాకూ తెలుసు!. నువ్వే హితబోధ చేయనవసరంలేదు....'

'మీకు మహా తెలుసులెండి...' ఎగతాళి చేసింది హైమ.

'చదువుకుని వుద్యోగం వెలగబెడుతున్నదానివి... ప్రపంచజ్ఞానం తెల్సినదానివి... భర్తతో ఎలా కాపురం వెలగబెట్టాలో తెలీదా?. దాంపత్య సుఖం అక్కర్లేదా? ఒకరికొకరు అక్కర్లేదనుకుంటే... సృష్టే ఆగిపోతుంది....'

'అంటే .... నన్ను కాదని మరో పెళ్లికి ప్లానా?... నేన్నీకు నచ్చలేదా?...' నిలదీసింది.

'ఎందుకు నచ్చలేదు. నువ్వొక రంభవి... నేనొక మన్మథుడ్ని.'

'ఏంటీ? వెటకారమా?- నేను మీతో కాపురం చేయటంలేదంటూ వూరంతా 'టముి' కేస్తారా?- ఆదివారం వచ్చిందటే చాలు వూరికే వుండరు- నా ప్రాణాలు తోడేస్తారు. మీ సోది ఆపి చేతిలో పేపరు చదువుకోండి...' రివ్వున లోనికెళ్లింది హైమ.

'వెళ్లిపోకు... ఇలారా!.... ఏదైనా హెూటల్లో డిన్నర్ చేసి ఈవెనింగ్ పిక్చర్‌కెళ్లొద్దామా... అప్పుడైనా మన మైండ్ ఫ్రెష్‌గ వుంటుందేమో?...' దువ్వాను.

'అలా అన్నారు భేషుగ్గావుంది...' కిలకిలా నవ్వింది.

X X X

హైమతో తగువుపడి ప్రయోజనం లేదన్పిస్తోంది! ఎన్ని విధాల మాట్లాడినా మనిషి కన్విన్స్ అవనందుకు ఆశ్చర్యపోతున్నానే గానీ ఆమెలో మార్పుతేలేకపోతున్నాను.

కోరికలే లేని భార్య... ఇదేం ఆడదండీ బాబూ? అని ఆశ్చర్యపోని రోజులేదు.

క్యాంపుమీద విజయవాడ వెళ్లాల్సిరావటంతో... పేరెంట్స్ వుంటోంది అక్కడే కాబట్టి హెూటల్లో రూమ్ తీసుకోవలసిన అవసరం లేకపోయింది.

పెళ్లై హైమతో కాపురం పెట్టేక పేరెంట్స్‌ని కలవబోవటం ఇదే తొలిసారి!. అవసరాన్ని బట్టి మొబైల్లో మాట్లాడుకుంటూనేవున్నాం. నాజాబ్ నెల్లూరులో!.

విజయవాడ క్యాంప్ వెళ్లాల్సివస్తుందని 'బాస్' నోటి వెంటరాగానే ఎగిరి గంతేసినంత పనైంది. చాలా నెలల తర్వాత వాళ్లని కలవబోతున్నందుకెంతో సంబరపడ్డాను.

అక్కడవుండే రెండురోజుల్లో అమ్మ చేతి కమ్మని వంట కడుపారా భోంచేయాలి!. భర్తతో సవ్యంగ కాపురం చెయ్యకపోవటం ఒక్కటే కాదు... కమ్మగ రుచిగ వంట చేయటం కూడా హైమకు రాదు.

అదేమంటే ఇల్లేమైనా హెూటలా అంటుంది!... నేను ఏమైనా వంటమనిషినా? అని ఎదురుచెప్తుంది. నాకు మా అమ్మ వంట నేర్పలేదు. నేను నేర్చుకోవాలనీ శ్రద్ధచూపలేదు. ఎంతకీ చదువుమీద ధ్యాస... అని తానిచ్చే బదులు సమాధానానికి నా వళ్లు మండేది.

పెడసరంగ మాట్లాడే భార్యపై చెయ్యిచేసుకోవటానికి నాకు సభ్యసంస్కారాలు అడ్డొచ్చేవి.

నా చేతివంట రుచిగ లేదన్పిస్తే... వెళ్లి మీ ఆఫీసు క్యాంటీన్‌లోనో... స్టార్ హెూటల్లోనో భోంచేయండి. నాకు చాకిరీ అయినా తప్పుతుంది... అంటూ శాపనార్థాలు పెట్టటం నేర్చుకుంది.

ఇంటిముందు ఆగిన ఆటోదిగి ఇంట్లోకి నడిచాను.

'వోరి వెధవాయ్... ఏమిటి చెప్పపెట్టాకుండ సడన్‌గ వూడిపడ్డావ్... రారా... ఏమేవ్...

నెల్లూరు నుంచి రెండోవాడు గోవిందు వచ్చాడే.. ఓమారు ఇలా రా...' కొడుకును చాలా రోజుల తర్వాత చూసినందుకు సంబరపడుతూ భార్యను కేకేసి చెప్పాడు శ్రీపతి.

గబగబా వంటింట్లోంచి వచ్చిన తల్లి శేషమాంబ 'ఏరా ఇదేనా రావటం? మరీ నల్లపూసైనావ్. బాగా చిక్కినట్టవుపిస్తున్నావ్. కోడలిచేతి వంట సరిపడలేదా ఏంటి?-' పలుకరించింది.

'అబ్బ... ఆ వివరాలన్నీ తర్వాత చేప్తాడుగా... ముందు స్నానానికి నీళ్ళు పెట్టు వీడికి. జర్నీ చేసి వచ్చాడుకదా...' అనటంతో శేషమాంబ లోనికి నడిచింది.

స్నానం చేసి లుంగీ చుట్టుకుని వచ్చి డాడీ పక్కనే కూర్చుని ఆయన చదువుతున్న పేపర్లోకి తొంగిచూశాను. ఈలోగ మమ్మీ కాఫీ తెచ్చింది.

'ఇంత కమ్మటి కాఫీ తాగి ఎన్నాళ్లయిందో? నీ చేతి కాఫీ... వంట అమోఘం అమ్మా'... సిప్ చేసి అన్నాను.

'అదేంటీ నీ పెళ్ళానికి కాఫీపెట్టటం కూడా రాదా?-' తల్లి విస్తుపోయింది.

'ఎందుకు అడుగతావులేమ్మా... దాని కేవీ చేతకాదు. ఫస్ట్ రాగానే జీతం తెచ్చుకుని బ్యాంకులో వేసుకోవటం తప్ప!...'

'పోనీలేరా... కోడలికి ఇంకా చిన్నతనం. మెల్లగా అన్నీ నేర్చుకుంటుందిలే...' డాడీ సమర్థించాడు.

'మీ నాన్న మాటలకేంలేరా?... అద్సరే కోడలు నీళ్లోసుకుందా లేక అప్పుడే పిల్లలెందుకనుకున్నారా?-' తరచి తరచి అడిగింది.

'ఏదైనా విశేషం వుంటే వాడే చెప్తాడుగా...' శ్రీపతి అన్నాడు.

'మీరు ఆగండి కాస్సేపు. నన్ను మాట్లాడనీయండి. అవు(నా... మీరుభయులూ ఏ డాక్టర్నైనా సం(ప్రదిస్తే బాగుండేది కదా? ఎవరిదగ్గరైనా లోపం వుటే తెలిసేది?...'

'ఇప్పుడు వాళ్లకి వయసేం మించిపోయిందని?... అయినా... కందకు లేని దురద కత్తిపీటకు దేనికీ అని...' చురకేశాడు.

'సరేలేమ్మా... బట్టలేసుకుని అలా వూళ్లోకి వెళ్లొస్తాను. నా క్కాస్త ఆఫీసుపనుంది. డ్యూటీమీద వచ్చాను కదా...' లేచి బెడ్రూమ్‌లో కెళ్లాను.

'అవునవును. వాడిని వెళ్లనీ.. ఆఫీసు ఒక దిక్కు... మనిల్లు వేరేదిక్కయిపోయె... సాయం(త్రం ఇంటికొచ్చాక భోజనం చేసి వాడు పడకేసేదాకా వీడి దుంపతెంచచ్చు...'

'అమ్మా!... మధ్యాహ్నం లంచ్ ఆఫీస్ కేంటీన్లో. దూరం కదా? ఇంటికి రాను... నాకోసం ఎదురు చూడకండి...' వీధిలోకెడుతూ చెప్పాను.

X X X

'హైమా! నువ్వీరోజు హాఫ్ డే సెలవు పెట్టి లేదూ పర్మిషన్ తీసుకుని ఇంటికొచ్చెయ్...' అన్నాను.

'ఎందుకుట?' ఎదురు ప్రశ్నవేసింది.'

'వివరాలు చెప్తేగాని రావా?-'

'ఆఫీసులో బాసుకు కారణం చెప్తేకదా... పర్మిషన్ గాని... హాఫ్‌డే లీవుగాని ఇచ్చేది...' ఆర్గ్యూ చేసింది.

'చెప్పటం అంత అవసరమా?-'

'బాస్ చాలా స్ట్రిక్ట్! కారణం చెప్పనిదే సీట్లోంచి కదలనీయడు...'

'దెన్... లిజన్! మనిద్దరం కలిసి ఈవెనింగ్ డాక్టర్ని కలవబోతున్నాం...'

ఆ మాట విన్న హైమ కంగుతిన్నది.

'ప్రాబ్లమ్ మీకా?... నాకా?-'

'ఇద్దరికీ...'

'ఏం చెకప్? ఎందుకు కన్సల్టేషన్?' సంభాషణ పొడిగించింది.

'రెండేళ్లుగా... ఐమీన్... మనమ్యారేజ్ అయిన నాటి నుండి నార్మల్ కోర్స్‌లో సంసారం చేయటంలేదు కనుక... డాక్టర్ కన్సల్టేషన్ అవసరమన్పిస్తోంది... ఎన్నేళ్లని మనం ఒక రూఫ్ కిందవున్నా... విడివిడిగా ఎవరికి వారై బ్రతుకుతాం?'

హైమ తీవ్రమైన ఆలోచనలోపడింది. ఈ రోజే ఎందుకింత విచిత్రంగ మాట్లాడుతున్నాడో అర్థంకాలేదు.

తనతో కలిసి డాక్టర్ చెకప్‌కు వెళ్లాలా వద్దానే డైలమాలో పడింది.

తను మాత్రం నిజాన్ని ఎన్నాళ్లని దాచిపెట్టగలదు? ఏనాటికైనా నిజం బైటపడక మానదు. ఇన్నాళ్లు రహస్యంగ దాచిన విషయం ఇప్పుడు బహిర్గతమైతే... తన భవిష్యత్ ఏమౌతుంది?. భర్తనుండి ఎడబాటు తప్పదా?... ' తనను వదిలించుకుని విడాకులివ్వటం ఖాయమా?-

క్యాంప్ మీద విజయవాడ వెళ్లివచ్చినప్పటి నుండి భర్తలో వచ్చిన మార్పు కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఎన్నాళ్లని పిల్లల్లేకుండా వుంటార్రా. మంచి డాక్టర్‌ని సంప్రదించి ఎవరిలోనైనా ప్రాబ్లముంటే... ట్రీట్‌మెంట్ తీసుకుంటే సమస్యవుండదు కదాని అత్తమామలు నూరిపోసి వుంటారు భర్తకు. అందుకే తేడాగ మాట్లాడుతున్నాడు.

కథ క్లైమాక్స్‌కొచ్చిందని హైమకు బోధపడింది. కుడితిలో పడ్డ ఎలక సామెతైంది. రానంటే ఏమౌతుందో?- వెడితే తన భవిష్యత్ ఎలావుంటుందో వూహించలేకుండా వుంది హైమ.

ఇంట్లోకెళ్లి ఓ గ్లాసెడు మంచినీళ్లు తాగొచ్చి... 'నాలో ఏలోపం లేదు.. లోపం మీలో వుందనుకుంటే... మీరొక్కరే వెళ్లి డాక్టర్ని కన్సల్ట్ చేయండి....' అడ్డుపుల్ల వేసింది.

'నో! ఇద్దరం వెడితేనే గాని మన సమస్యకు పరిష్కారం దొరకదు. నీకేం భయం అక్కర్లేదు. నిన్ను లేడీ గైనకాలజిస్ట్‌తో చెకప్ చేయిస్తా... నేనేమో మేల్ డాక్టర్ని కన్సల్ట్ చేస్తాలే...' పకపకా నవ్వాను.

'మీకు అంతా వేళాకోళమే!- నాకేం లోపం లేదు మొర్రో అంటే విన్పించుకోరేం?...' ఇంకోసారి బ్రేక్ వేసింది.

'నీ ధోరణి నాకేం నచ్చలేదు హైమా... ఇద్దరమూ వెళ్లాల్సిందే! తప్పదు. నువ్వు అనవసరంగ ఆర్గ్యూ చెయ్యకు!

'సరే!... తపేదేముంది? భర్తగ మీరు ఆర్డర్ వేశాక నేను 'నో' అని చెడ్డదాన్ని కావటం దేనికి? వస్తాలెండి...'

ఇద్దరూ ఆఫీసుకు బయల్దేరారు! హైమను నేను స్కూటర్ మీద దాని ఆఫీసు వద్ద డ్రాప్ చేసి నేను నా ఆఫీసుకెళ్లాను.

X X X

సాయంత్రం నాలుగు గంటలకల్లా నేను హైమ స్కూటర్ మీద కార్పోరేట్ హాస్పిటల్ చేరుకున్నాం!

హైమలో తీవ్రమైన ఆలోచన... గందరగోళం... భయం... కుదిపేస్తున్నయ్. ఈనాటితో భార్యాభర్తల బంధానికి కాలం చెల్లిపోతుంది కాబోలనేసి వర్రీ అవుతోంది. ఈ విషయం... మమ్మీ డాడీల క్కూడా చెప్తే బాగుండేది. కానీ వీలుపడలేదు.

'ఇదిగో హైమా... నేను గైనకాలజిస్ట్ వసుంధర గారివద్ద ఆల్‌రెడీ అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. నువ్వు లోనికెళ్లి ఆమెను కన్సల్ట్‌చేసి మన ప్రాబ్లమ్ చెప్పి చెకప్ చేయించుకో... నేను మేల్ డాక్టర్ దగ్గరకెళ్లొస్తాను. ఇద్దరం కల్సి ఇంటికెళ్దాం...' అన్చెప్పి హైమను డా॥ వసుంధర రూమ్ వద్ద కూర్చోమని చెప్పి నేను మేల్ డాక్టర్ కోసం ముందుకు నడిచాను.

తనవంతు రాగానే నర్స్ వచ్చి లోనికి వెళ్లమని చెప్పి ఆమే ఫాలో అయింది.

లేడీ డాక్టర్‌ను చూడగానే విష్ చేసింది హైమ.

'కమాన్.... రండి! అలా కూర్చోండి! అవునూ మీ హజ్బెండ్ రాలేదా?...'

'వచ్చారు డాక్టర్... కన్సల్టేషన్ కోసం మేల్ డాక్టర్ని కలిసేందుకెళ్లారు...'

'ఐ,సీ.!- ఆ! చెప్పండి... వాటీజ్ యువర్ ప్రాబ్లమ్'

సిగ్గుతో విషయాన్ని చెప్పలేకపోయింది హైమ.

'మీరేం చెప్పద్దు. లెట్‌మీ ఎగ్జామిన్... మీకు పిల్లలు లేరా?... సరే... మీరా కర్టెన్ వెనకున్న బెడ్‌మీద పడుకోండి...' అనేసి డాక్టర్ కూడా హైమ వెంట నడిచింది.

చెకప్ చేసిన డాక్టరు నివ్వెరపోయింది!

'ఓ మైగాడ్... మీరు పుష్పవతే కాలేదు. నోఫియర్స్... లేచివచ్చి మీ ఛైర్లో కూర్చోండి.' అని డాక్టరు కూడా వెనుదిరిగింది.

ఇలాంటి స్త్రీలను 'మాచకమ్మ'లంటారు. మాచకమ్మలనబడే స్త్రీలు సంసారానికి పనికిరారు. పీరియడ్స్ వుండవుకదా?... అయినా ఈ విషయాన్ని దాచి మీకు పెళ్లి చేయటం కన్న తల్లితండ్రుల తప్పు!- పెళ్లికి పూర్వమే మిమ్మల్ని డాక్టర్స్‌కి చూపి వారి సలహామేరకు ట్రీట్‌మెంట్ తీసుకుని వుండివుంటే మీకీ ప్రాబ్లమ్ వుండేది కాదు.. - ఎనివే... డోన్ట్ వర్రీ...'

'నా ప్రాబ్లమ్స్‌కి పరిష్కారం వుండదని ఇరుగు పొరుగు బంధువులు చెప్పగా మా పేరెంట్స్ డాక్టర్ల నెవ్వరినీ సంప్రదించలేదు....' అప్పట్లో !

'ఇప్పుడు వెనకటిలా కాదండి. మెడికల్ సైన్స్ ఎంతో ఎడ్వాన్స్ అయింది. మీరు భయపడకండి! మీ హజ్బెండ్‌కి ఈ విషయం చెప్పను. అయితే మీరు నార్మల్ ఫామిలీ లైఫ్ సాగించాలంటే... మీకు ఒక ఆపరేషన్ చేయాల్సివుంటుంది'.

డాక్టర్ మాటకు హైమ ముఖం విప్పారింది. తన ప్రాబ్లమ్‌కి సొల్యూషన్ దొరికినందుకు డాక్టర్‌కి థ్యాంక్స్ చెప్పి!.... గండం గడిచినందుకు... భర్తతో తాను సుఖపడబోతున్నందుకు మనసులో దేవుళ్లందరికీ మొక్కింది!. ఆపరేషన్ చేయించుకున్న తర్వాత భర్తతో తాను సుఖంగ సంసారం అందరి ఆడవాళ్లలా చెయచ్చు!. ఇక ఏ సమస్యావుండదు... అనుకుంది.

ఇంతలో నా చెకప్ ఫినిష్ కావటంతో హైమ కన్సల్ట్ చేస్తున్న డాక్టర్ గది సమీపించి డోర్ నాక్‌చేసి లోనికెళ్లాను.

నన్ను చూడగానే 'మీ శ్రీమతికి చిన్న ఆపరేషన్ అవసం! వెంటనే చేయించండి! షి విల్‌బి ఆల్‌రైట్- ఇకపై మీ సంసార సుఖానికి ఎలాంటి అవరోధమూ వుండదు...' డాక్టర్ పరిష్కార మార్గం మా సమస్యకు చూపినందుకు నా మనసు పులకించి... పరవశించింది!!

---సమాప్తం---